
# రాజీనామా

జి. మల్లీశ్వరి చిరంజీవి




ఆర్ట్సు కాలేజీ వార్షికోత్సవంలో చివరి కార్యక్రమంగా వక్తృత్వపు పోటీ ప్రారంభమైంది. 'స్త్రీలూ - ఉద్యోగాలూ' అనే విషయం మీద ఆర్ట్సు గ్రూపు తరపున ఆనందరావు సైన్సు గ్రూపు నుంచి సునంద పోటీ చేస్తున్నారు. మైకులో పేరు వినిపించగానే ముందు వరుసలోని సునంద వేదిక మీదికి వచ్చి మైకు ముందు నుంచుంది. స్టూడెంట్స్‌తో క్రిక్కిరిసివున్న కాలేజీ ఆడిటోరియం ఈలలు, పిల్లి కూతలతో కొద్ది క్షణాలు మారుమోగింది.

"మీ స్వాగతానికి ధన్యవాదాలు. నాకింత మంది అభిమానులున్నారన్న సంగతి నాకీక్షణం దాకా తెలీదు. ఏమాత్రం బెదరకుండా చిరునవ్వుతో స్పష్టంగా పలికింది సునంద. క్షణాల్లో గోల సద్దుమణిగింది. సునంద మాట్లాడటం ప్రారంభించింది.

"ఈ పోటీకి విషయాన్ని ఎన్నుకోవడంలోనే మగవారి పక్షపాతం స్పష్టమవుతూ ఉంది. "స్త్రీలు - ఉద్యోగాలు' 'స్త్రీ స్వాతంత్ర్యం' - అసలు ఈ శీర్షికలకి అర్థం ఏమిటి? 'పురుష స్వాతంత్ర్యం', 'పురుషులు - ఉద్యోగాలు' అనే మాటల్ని ఎక్కడైనా వింటున్నామా మనం? స్త్రీలు ఉద్యోగాలు చెయ్యాలా వద్దా. స్త్రీలకి స్వాతంత్ర్యం అవసరమా లేదా అన్నది మాత్రమే తరతరాలుగా మనకి చర్చనీయాంశంగా ఉంటున్నది. జనసంఖ్యలోనూ, జీవితాన్ని పంచుకోవడం లోనూ సగానికి పైగా భాగం వహిస్తున్న స్త్రీ జాతిని కించపరచడం కాదా ఇది? మనలోని వైరుధ్యం ఏమిటంటే పురాణాల్లోను, పూజా పునస్కారాల్లోనూ స్త్రీని ఆదిశక్తిగా, దేవతగా పూజించగా ఆచరణలో మాత్రం ఆడదాన్ని ఈ నాటికీ ఒక సెకెండ్ రేట్ సిటిజన్‌గానే పరిగణిస్తున్నాం. సిగ్గు పడాల్సిన సంగతి కాదా ఇది? సరే యిక అసలు విషయానికొస్తాను.

"మన నాగరికత పరిణామ దశని పరిశీలించి చూసినట్లయితే వ్యవసాయాన్ని మొదట కనుగొన్నది స్త్రీయే నని సామాజిక చరిత్ర చెపుతున్నది. కాబట్టి మొట్టమొదట ఉద్యోగాన్ని కనుగొన్నది, కొనసాగించినది, స్త్రీయేనని చెప్పుకోవచ్చు. సామాజిక పరిణామ క్రమంలో మాతృస్వామ్యం అంతరించి, మగవాడు ఉత్పత్తి శక్తుల్ని కైవసం చేసుకోవడం జరిగాక పితృస్వామ్యం అవతరించింది. పురుషాధిక్యత సమాజంలో చోటు చేసుకోవడం ప్రారంభమైంది. ఆర్థిక పరమైన అవసరాలు, అసమానతలే మనుషుల మధ్య సంబంధాలని నిర్దేశిస్తాయి అన్నాడు కారల్ మార్క్స్. ఆర్థికావసరానికి స్త్రీ పురుషుడి మీద ఆధార పడటం ఎప్పుడయితే ప్రారంభమైందో ఆనాడే స్త్రీ అబలగా, మగవాడికి బానిసగా బ్రతకడం మొదలైంది. ఈ పరిస్థితి మారాలంటే స్త్రీ ఆర్థికంగా విముక్తురాలు కావాలి. తన జీవితావసరాలకి పురుషుడి మీద ఆధార పడటం అనే సంకెళ్ళని తెంచుకుని బయటపడాలి. అందుకు ఒక్కటే మార్గం - స్త్రీ వుద్యోగం చెయ్యటం. ఆలోచించండి" అని ముగించి స్టేజి దిగింది సునంద.

హాల్లో చప్పట్లు, ఈలలు. హుర్రే హుర్రేలు. ఆ కోలాహలం సద్దుమణిగాక ఆనందరావు మైకు ముందుకొచ్చి నుంచున్నాడు. మైకుని కుడిచేత్తో పట్టుకుని చిన్నగా ఒకసారి దగ్గి గొంతు సవరించుకుని చెప్పటం ప్రారంభించాడు: "సైన్సు స్టూడెంటయినా కుమారి సునంద సోషియాలజీ గురించి, మార్క్స్ గురించి ప్రస్తావించి తమ విజ్ఞతని ప్రదర్శించుకున్నారు. మంచిదే. కాని ఆవిడగారు ఒక్క విషయాన్ని గుర్తించటం లేదు. సిద్ధాంతాలు వినడానికీ, చదవడానికి బాగుంటా యేమో గాని, క్షణక్షణం మారుతున్న జీవితం ఓ సిద్ధాంతానికి పూర్తిగా కట్టుబడి ఉండదు. ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం చేతనే స్త్రీలు బానిసలుగాను భర్తలు పెట్టే హింసలకు గురి అవుతూను ఉన్నారనీ, అదనీ, ఇదనీ ఏదో అన్నారు సునంద. కాని ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోయినా మొగుణ్ణి రాచి రంపాన పెడుతున్న పెళ్ళాలు ఎంత మంది లేరు. పెత్తనం చెలాయిస్తున్న భార్యలు ఎందరు లేరు. మా అమ్మ సంగతే తీసుకోండి - ఆవిడ చదువుకో లేదు. ఏ ఉద్యోగమూ వెలగబెట్టడం లేదు. అయినా ఇంట్లో పెత్తనమంతా ఆవిడదే. ఆమె ముందు నోరెత్తడానికి భయపడతాడు మా నాన్న పాపం."

"అంచేత నేను చెప్పవచ్చేది ఏమిటంటే స్వాతంత్ర్యం అనేది ఒకరు ఇచ్చేదీ మరొకరు పుచ్చుకునేదీ కాదు. వారి వారి వ్యక్తిత్వాన్ని బట్టి ఉంటుంది. ఇదంతా పోనీండి. ప్రాక్టికల్‌గా ఆలోచిద్దాం. ఈనాడు మన దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నది. సమాజం ఎంత మారినా, పురోగమించినా భార్యాబిడ్డల్ని పోషించే బాధ్యత మాత్రం ఇంకా పురుషుడి మీదే ఉంది. పురుషులతో బాటు సమానంగా మేమూ ఉద్యోగాలు చేస్తాం అని స్త్రీలు పోటీపడుతున్నారు. పర్యవసానం ఏమిటి? పురుషుల్లో నిరుద్యోగ సమస్య మరింత పెరిగి పోవటం కాదా? స్త్రీలు ఉద్యోగాలు చెయ్యకూడదు అన్నది నా ఉద్దేశం కాదు. అర్థికావసరాన్ని బట్టి, తన వారిని ఆదుకోవడానికి స్త్రీలు ఉద్యోగం చెయ్యటాన్ని నేను వ్యతిరేకించడం లేదు. కాని వివాహానంతరం కూడా స్త్రీ ఉద్యోగాన్ని అంటిపెట్టుకుని ఉండటం వల్ల భర్త సంపాదనా, ఆమె సంపాదనా కలిసి రెండింతలవుతున్నది. ఆ డబ్బు అదనపు సౌకర్యాలు సమకూర్చుకోవడానికి ఖర్చవుతున్నది. ఒక పురుషుడు నిరుద్యోగిగా మిగిలి పోతున్నాడు. అందరికీ ఉద్యోగాలు లభించే పరిస్థితి ఏర్పడే దాకా మన దేశంలో భార్యా భర్తల్లో ఒకరు మాత్రమే ఉద్యోగం చేసేట్టుగా ఉండాలి. "నేను ఉద్యోగానికి వెళతాను. మీరు రాజీనామా చేయండి" అని ఏ భార్య అనదు. కాబట్టి వివాహమైన తరువాత నైనా ఉద్యోగం చేస్తున్న స్త్రీ తన ఉద్యోగానికి రాజీనామా ఇవ్వాలి. అలా చేసినట్టయితే ఒక నిరుద్యోగి అయిన యువకుడికి ఆ ఉద్యోగావకాశం కల్పించినట్లవుతుంది. నేటి యువకుల్లో నిరుద్యోగ సమస్యని కనీసం ఆ మేరకు పరిష్కరించినట్టు అవుతుంది. కాదంటారా?" అని కూర్చున్నాడు ఆనందరావు. అతనికీ చప్పట్లు కొట్టారు శ్రోతలు.

పావుగంట తరువాత పోటీ ఫలితాలు ప్రకటించబడినయ్. వక్తృత్వపు పోటీ ప్రథమ బహుమతిని సునంద, ఆనందరావులిద్దరూ సమంగా గెలుచుకున్నారు.

రెండు నెగటివ్‌లు కలిస్తే ఒక పాజిటివ్ అవుతుందంటారు. అలాగే విభిన్న అభిప్రాయాలతో వాదించి ఆనాడు బహుమతిని చెరిసమంగా పంచుకున్న సునంద, ఆనందరావులు ఆర్నెల్లు తిరిగే సరికల్లా ప్రేమలో పడటం, మరో ఆర్నెల్లు గడిచేసరికి ఆదర్శ దంపతులైపోవడం జరిగింది.

బి.ఏ. ఫస్టు క్లాసులో పాసయిన ఆనందరావుకి బాంక్‌లో ఆఫీసర్‌గాను, సునందకి ఎల్.ఐ.సి.లోనూ ఉద్యోగాలు దొరికినయ్. జీవితం హాయిగా గడిచి పోతూంది. రెండేళ్ళు తిరిగేసరికి వాళ్ళకి ఒక చక్కని పాప కూడా పుట్టింది. పాపని క్రెష్‌లో చేర్పించారు. పాపకి ఏడాది నిండింది.

ఒక రోజు రాత్రి పడుకోబోయేముందు ఆ మాట ఈ మాటా మాట్లాడుతూ "నేను వుద్యోగానికి రాజీనామా ఇవ్వాలనుకుంటున్నానండీ" అన్నది సునంద.

"అదేమిటి? నీకేమన్నా మతి పోయిందా?" అన్నాడు ఆనందరావు భార్యకేసి వింతగా చూసి.

"మన పాపని రోజూ ఆ క్రెష్‌లో వదిలి వెళ్ళడానికి



# అనాదరణకు మరోపేరు ఆడపిల్ల

"జనాభాలో ఆడపిల్లల నిష్పత్తి రోజురోజుకీ తగ్గుముఖం పడ్తున్న దేశాల్లో భారత దేశం ఒకటని, పుట్టబోతున్నది ఆడపిల్లని ఆధునిక సాంకేతిక వైద్య పద్ధతుల ద్వారా ముందుగా తెలుసుకుని గర్భవిచ్ఛేదం చేయించుకునే వారు కొందరయితే, ఆడపిల్ల పుట్టిన తర్వాత ఆమె పట్ల నిర్లక్ష్యవైఖరి చూపే వారు మరింత ఎక్కువగా కనపడుతున్నారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛెయిర్ పెర్సన్ బేగం బిల్కీస్ లతీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాదు ఆంధ్ర మహిళా సభలో డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ 83వ జయంత్యుత్సవాల సందర్భంగా (15-7-91) "ది ఛాలెంజెస్ ఆఫ్ ఉమెన్స్ వెల్‌ఫేర్" (స్త్రీ సంక్షేమం - నిర్వాహణ - కొన్ని సవాళ్ళు) అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు.

ఆడపిల్లలపై నిర్లక్ష్యం కేవలం ఒక్క చదువు, ఉద్యోగం, లాంటి వాటిల్లోనే కాక ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల్లో కూడా కన్పిస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వయస్సు నించే కూలీ పనులు, ఇంటి పనులు, బరువు బాధ్యతలు మోయవలసి వస్తున్నదని, స్వాతంత్ర్యం వచ్చి 43 వసంతాలు పూర్తయినా, స్త్రీలలో చాలా మందికి, వాళ్ళకున్న చట్టపరమైన హక్కులు గురించి తెలియనే తెలియదని బేగం బిల్కీస్ లతీఫ్ అన్నారు.

సాంఘిక సంక్షేమ సంస్థలు, సేవా సంస్థలు రోజు రోజుకూ పెరుగుతున్నా, స్త్రీలకు వర్తించే చట్టాలను కాలానుగుణంగా సవరించినా మహిళా సమస్యలు పరిష్కారం కాలేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖలు రకరకాల వృత్తులలో ఎక్కువ మంది మహిళలు పాల్గొనటానికి కావాల్సిన పరిస్థితులను కల్పించాలని, మహిళ లకు ఉద్యోగావకాశాలు కల్పించే పరిశ్రమలను గ్రామాల్లో ఏర్పాటు చేయటం, వాటి యాజమాన్యంలో కూడా స్త్రీలు పాల్గొనే అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలలో స్త్రీలు ఉద్యోగాల్లో చేరటానికి గరిష్ఠ పరిమితి వయస్సును 35 సం॥కు పెంచాలని ఆమె సూచించారు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో స్త్రీలపట్ల పక్షపాత వైఖరి లేకుండా చూడాలని, పార్టు టైము పనుల అవకాశాలను గుర్తించి వాటిలో స్త్రీలకు ముందుగా అవకాశం యివ్వాలని ఆమె కోరారు.

శిశు సంక్షేమ సంస్థలు, కుటుంబ నియంత్రణ గురించి భోదించే కార్యక్రమాలూ సలహా కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని, చట్టాల్లో ఉన్నవాటిని ప్రభుత్వాలు ఆచరణలో పెట్టలేక పోతున్నాయని, బేగం లతీఫ్ విమర్శించారు.

మహిళా మండలులు, సేవాసంస్థలు స్త్రీలను సంఘటితం చేయటంలో తీవ్రంగా కృషి చేయాలని బేగం బిల్కీస్‌లతీఫ్ సూచించారు. జాతీయ మహిళా కమీషన్ బిల్లుకు పార్లమెంటు అంగీకారాన్ని తెలిపింది కనుక దానిని చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. ఈ కమీషన్ ప్రగతి శీల దృక్పధం ద్వారా స్త్రీ-శిశు సంక్షేమ కార్యక్రమాల అమలులో మనం ఎదుర్కొంటున్న సవాళ్ళు - భవిష్యత్‌లో ఉండవని ఆశిద్దాం. అప్పుడే స్త్రీ జనసంక్షేమ కల్పవల్లి. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారు కన్నకలలు నిజమై, విద్య, వైద్య, సాంకేతిక శిక్షణ రంగాలలో స్త్రీలకు నిజమైన న్యాయం చేకూరుతుందని ఆమె అన్నారు.

మద్రాసు, హైదరాబాదు నగరాల్లో ఉన్న దుర్గాబాయి మహిళా విద్యాపీఠాల్లో, ఆంధ్ర మహిళా సభ పూర్వ విద్యార్థిని డాక్టర్ సర్వాశారద పేరున ఎండోమెంటు ఏర్పాటు చేసి, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఆంధ్ర మహిళా సభ ట్రస్టు బోర్డు అధ్యక్షురాలు శ్రీమతి కంచెర్ల సుగుణమణి, తొలుత ఆహూతులకు స్వాగతం పలికారు.

మల్లిడి సత్తిరెడ్డి

---

నాకు మనసొప్పడం లేదండీ. ఆఫీసుకు వెళ్ళినా వచ్చీరాని దానిముద్దుమాటలే చెవుల్లో గింగురు మంటున్నాయి. దాన్ని వదలి ఆఫీసుకి వెళుతున్నప్పుడు 'అమ్మా' అంటూ అది నావేపు చేతులు చాచడం, ఆ పసి కనులలో 'నన్ను వదిలి పోతున్నావు కదూ' అనే దీనమైన ఆ చూపులూ నన్నువెంటాడుతూంటాయి నేను మళ్ళీ ఇంటికి తిరిగొచ్చేదాకా. అందుకే బాగా ఆలోచించి నేనీ నిర్ణయం తీసుకున్నాను. మన పాప నా చేతుల్లోనే పెరగాలి. దాని ఆలనా పాలనా చూడ్డం కంటే ఆ ఉద్యోగం నాకు ఎక్కువేమీ కాదు" అన్నది సునంద స్పష్టంగా.

"అందుకని నెలకి రెండు వేల రూపాయల ఉద్యోగాన్ని ఒదులుకుంటానంటావా? నువ్వొక్క దానివే బిడ్డని కన్నట్టు, ఉద్యోగానికి వెళుతున్నట్టు మాట్లాడతావేమిటి?" అన్నాడు ఆనందరావు కోపంగా.

"ఒక్క సంగతి ఆలోచించండి. మీకొచ్చే జీతం మనకి చాలుగా చెప్పండి? పైగా మనకి సొంత ఇల్లు, ఊళ్ళో కొంత ఆస్తి ఉంది. ఈ పరిస్థితుల్లో నేను ఉద్యోగం చెయ్యడం నిజంగా మనకి అవసరమే నంటారా?" అడిగింది నిదానంగా సునంద.

"అయితే మాత్రం నెలకి రెండువేలు నీకు చేదుగా ఉందా? పైగా మనం కన్నది ఆడపిల్లని" అన్నాడు చిరాగ్గా ఆనందరావు.

"అయితే ఏమయిందండీ? నేను ఆడపిల్లని కానూ. కట్నం లేకుండా మీరు నన్ను చేసుకోలేదా ఏమిటి? అట్లాగే మన అమ్మాయికి కూడా కట్నం ఆశించని మీలాంటి ఓ మంచి మొగుడు దొరుకుతాడనే నాకుంది లెండి" అనింది సునంద.

"ఆదర్శాలు వల్లించడానికి బాగుంటాయేమోగాని జీవితానికి పనికిరావు తెలిసిందా?" అన్నాడు అతను కటువుగా.

"ఆచరణకి పనికి రాని ఆదర్శాలని అసలు వల్లించడమెందుకండీ అయితే? మనిద్దరికీ పరిచయం ఏర్పడిన మన కాలేజీ ఫంక్షన్‌ని ఒక్కసారి గుర్తుకి తెచ్చుకోండి. "నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉన్న మన దేశంలో భార్యా భర్తలిద్దరూ ఉద్యోగం చేయడం ఎంత వరకూ న్యాయం?' అని ఎంత చక్కగా వాదించారు ఆనాడు! పోటీలో మీకు ప్రత్యర్థినే అయినా లోలోపల మీవాదనని ఎంతగా మెచ్చుకున్నానో తెలుసా అప్పుడు?" అన్నది సునంద గతాన్ని గుర్తుకి తెచ్చుకుంటూ.

"ఓహో! నన్ను దెప్పిపొడుస్తున్నా వా ? ఇప్పుడు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి త్యాగమూర్తివి అనిపించుకోవాలని ఉందా? నువ్వొదులుకునే ఈ ఉద్యోగం నిజంగా అవసరముండే మరో వ్యక్తికే దొరుకుతుందన్న నమ్మకమేమిటి అసలు?" ఎగతాళిగా ప్రశ్నించాడు ఆనందరావు.

"మంచి జరుగుతుందన్న నమ్మకంతోనే కదండీ మనం ఏ పనైనా చేసేది. మీరన్నట్టు నేనేమీ త్యాగం చేస్తున్నాననుకోవడం లేదు. పెరిగే వయసులో మన పాపకి వీలైనంత దగ్గరగా ఉండాలని కోరుకుంటున్నాను. అంతే" అన్నది సునంద.

"సరేగాని సీతులు చాలించి లైటార్పేసి పడుకో చాలు. నాకు నిద్రొస్తోంది" కసిరినట్టుగా అనేసి అటు పక్కకి తిరిగి పడుకున్నాడు ఆనందరావు.

తెల్లవారింది.

ముభావంగానే కాఫీ టిఫినూ ఆరగించి ఆఫీసుకి వెళ్లిపోయాడు. తను తీసుకున్న నిర్ణయం భర్తకి బాగా కోపం తెప్పించిందని అర్థమైంది సునందకి. ఆఫీసుకి వెళ్ళకుండా ఆరోజంతా ఆలోచిస్తూనే గడిపింది. చివరికి ఒక నిర్ణయానికి రాగలిగింది.

రోజూ సాయంత్రం ఆరుగంటలకే ఆఫీసు నుంచి వచ్చి పాపతో ఆడుకుంటూ గడిపే ఆనందరావు ఆ రోజు చాలా ఆలశ్యంగా యింటికి తిరిగి వచ్చాడు. భార్య అన్నం వడ్డిస్తే మాటా పలుకూ లేకుండా ఏదో అయిందనిపించి చేతులు కడుక్కుని లేచాడు. సునంద పలకరించినా జవాబు చెప్పలేదు. ఆమెకి లోలోపల దుఃఖం పొర్లుకొచ్చింది. అయినా బయట పడకుండా వంటిల్లు సర్ది పడగ్గదిలోకి వచ్చింది. వీళ్ళ గొడవతో మనకేమిటిలే అన్నట్టుగా గదిలో మంచం మీద పాప హాయిగా నిద్ర పోతూవుంది. పాపకి చెరో వైపూ ఎడమొఖం పెడమొఖంగా పడుకున్నారు భార్యా భర్తలిద్దరూ చెరో గోడ వైపు తిరిగి.

కొద్ది క్షణాల తర్వాత ఆమె భుజం మీద వెచ్చగా పడింది అతని చెయ్యి.

"ఈ రోజంతా ఆఫీసులో నిన్ను గురించే ఆలోచిస్తూ గడిపాను సునందా. నువ్వు తీసుకున్న నిర్ణయం మంచిదే ననిపించింది నాక్కూడా. రాజీనామా ఉత్తరం పంపేశావా?" అడిగాడు ఆనందరావు.

నమ్మలేనట్టుగా ఇటుపక్కకి తిరిగి అతనికేసి చూసింది సునంద.

నిజం సునందా! మనస్ఫూర్తిగానే అంటున్నాను. నీ మనసుకి తోచినట్లే చెయ్" అన్నాడు ఆనందరావు సౌమ్యంగా.

"రాజీనామా వుత్తరం రాసి కవర్‌లో పెట్టానండీ. రేపు మీ చేతులతోనే పోస్టు చేసిరండి?" అంటూ భర్త చేతిమీద తన చేతిని వేసి ప్రేమగా నొక్కింది సునంద. □